క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ ప్రారంభం


మద్దమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న పీఎస్ జనార్దన్

కోడుమూరు రూరల్ : వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా శనివారం మండలంలోని లబ్ధిదారులకు గ్రామ సచివాలయ సిబ్బంది పంపిణీ చేపట్టారు. మండలంలో మొత్తం 9,130 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, 6754మందికి ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేసింది. 2,376 మంది వృద్ధులు, వికలాంగులకు గ్రామ సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ల డబ్బులను అందజేస్తున్నారు.

90శాతం సబ్సిడీతో ఎరువులు అందించాలి


ఏఓ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రమిస్తున్న రైతు సంఘం నాయకులు

కల్లూరు: ఖరీఫ్ సాగుకు సంబంధించి అన్నిరకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి కృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏఓ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్ముతున్న డీలర్లపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కె.మధు, రైతులు భాస్కర్‌రెడ్డి, హరిబాబు, శీను తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, పిల్లలకు సకాలంలో టీకాలు ఇవ్వాలి

● డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కల్లూరు: గర్భిణులు, పిల్లలకు సకాలంలో టీకాలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శనివారం కల్లూరు అర్బన్ లక్ష్మిపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుచున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కార్యకర్త శిశువులకు, గర్భిణులకు నిర్దేశించిన సమయానికి సరైన మోతాదులో వ్యాధి నిరోధక టీకాలను వేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు, గర్భిణులకు ఇస్తున్న ఐరన్ మాత్రల పంపిణీ, పోషకాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు మధ్యాహ్నం భోజన సమయంలో ఐరన్ మాత్రలు తినిపించాలని సూచించారు. ఐదేళ్లలోపు పిల్లలు తీవ్ర పోషకాహార, అతి తీవ్ర పోషకాహారంలోపం, ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం, రక్తహీనత, న్యూమోనియో లాంటి సమస్యలుంటే ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎన్ఆర్‌సీ కేంద్రానికి తరలించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్‌ను అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్): ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్వాన్సుడు సప్లిమెంటరీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పనిచేసే కొందరు అధికారులు ఓపెన్ టెన్త్, ఇంటర్ సెంటర్ల నిర్వాహకులతో కుమ్మక్కై మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

సంపత్ హత్యపై విచారణ జరపాలి

కర్నూలు(సెంట్రల్): ఎన్ఎస్‌యూఐ జాతీయ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్ హత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి రామాంజనేయులు, ముస్లిం మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి ఖాద్రీపాషా శనివారం వేర్వేరు ప్రకటనల్లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్యసాయి జిల్లా హిందూపూర్‌కు చెందిన సంపత్‌కుమార్‌ను వారం రోజుల క్రితం హత్య చేశారన్నారు. అయితే ఇంతవరకు ఎవరు హత్య చేశారో పోలీసుల విచారణలో తేలలేదన్నారు. హిందూపూర్‌లో ఆరాచకం రాజ్యమేలుతోందని, శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యతపై ప్రభుత్వం ఉందన్నారు.

కార్మికుల కడుపు కొట్టొద్దు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను తీసి వేసి వారి కడుపు కొట్టొద్దని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బతుకన్న కోరారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒకవైపు కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ విస్తరించుకుంటూ పోతుంటే.. కార్మికుల సంఖ్యను పెంచాల్సింది పోయి.. కొంతమందిని తీసివేసేలా నిర్ణయం తీసుకోవడం భావ్యం కాదన్నారు. ఇప్పటికే ఉన్న సిబ్బంది కాలువల్లో పూడిక తీయలేక, రోడ్లను శుభ్రం చేయలేకపోతున్నారన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి జయంతి



గిడ్డాంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న డా.సతీష్, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి


స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

కోడుమూరు రూరల్: ఆంజనేయస్వామి జయంతిని పురస్కరించుకొని శనివారం మండలంలోని ఆంజనేయ స్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కోడుమూరులోని చిన్న బోయవీధి, కోటవీధి, ఇరిగేషన్ కార్యాలయం ఆవరణ, కొండపేట, బీసీ కాలనీల్లో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల్లో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

వెంకటగిరిలో ప్రముఖుల పూజలు

మండలంలోని వెంకటగిరిలో గిడ్డాంజనేయ స్వామి జయంత్యోత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ నిర్వహించారు. గిడ్డాంజనేయస్వామికి కోడుమూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆలూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు కోట్ల హరిచక్రపాణిరెడ్డి, కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కల్లూరు: కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కల్లూరు అర్బన్ ముజఫర్‌నగర్‌లో అభయ ఆంజనేయ స్వామి, గోవర్ధన్‌నగర్‌లో పంచముఖ ఆంజనేయ స్వామి, చిన్నటేకూరు, పందిపాడు (కల్లూరు ఎస్టేట్)లో గోడల వీర హనుమంతరాయుడు స్వామిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఓర్వకల్లు: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో శనివారం హనుమద్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధానంగా కొమ్ముచెరువు, కాల్వ గ్రామ సమీపంలో వెలసిన కోనేటి ఆంజనేయస్వామి, లోద్దిపల్లెలో వీరాంజనేయ స్వామి, బొడ్డువానిపల్లె ఆంజనేయస్వామి, ఓర్వకల్లులోని ఆంజనేయస్వామి దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. స్వాముల వారికి సిద్ధోదక స్నానం, అభిషేకం, సింధూర అలంకరణ, కలశ స్థాపన, ఆకుపూజలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న దానం చేశారు. అలాగే భజన కళాకారులచే భజన భజన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వాముల వారికి గ్రామోత్సవం నిర్వహించారు.

గూడూరు: పట్టణంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్న దానం నిర్వహించారు. సాయంత్రం పట్టణంలోని పుర వీధులలో హనుమాన్ శోభ యాత్ర నిర్వహించారు.

పాణ్యం: మండలంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి వాయిపుత్రుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆకుపూజ, వడమాల, పానకం ఇతర పిండిపదార్థాలను భక్తులు స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవాదాశాఖ ఆద్వర్యంలో ఆంజినేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. చెరువు కట్ట ఆంజనేయస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు. తాటికాయచెరువు ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు తాకిడి పెరిగింది. డొంగు వద్ద వెలసిన భారీ ఆంజనేయస్వామి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు.

గడివేముల: మండల పరిధిలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.


కోడుమూరులో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో యువకుల ర్యాలీ


ఓర్వకల్లులో భజన చేస్తున్న కళాకారులు


గూడూరులో హనుమాన్ శోభా యాత్ర


ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించిన జేసీ


స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీలో భద్రపరచిన పాణ్యం అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను ఆ నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి పరిశీలించారు. శనివారం ఆమె కమ్యూనికేషన్ సెంటర్‌లో స్ట్రాంగ్ రూమ్‌ల లైవ్‌ఫీడ్‌ను పరిశీలించి సంతకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం, అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నంద్యాల ఎంపీ స్థానం ఫలితాల ప్రకటన కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జూన్ 4వ తేదీన చేపట్టే కౌంటింగ్ కోసం దాదాపు 200 మంది సిబ్బందిని నియమించామని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మొదట కల్లూరులో ఓట్ల లెక్కింపు ప్రారంభమై చివరిగా గడివేముల మండలం ఎస్.కొత్తూరు పోలింగ్ కేంద్రంతో పూర్తవుతుందని వివరించారు.

విజయోత్సవ సంబరాలు నిషేధం


మాట్లాడుతున్న కర్నూలు రూరల్ సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి

గూడూరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 4న ఓట్ల లెక్కింపు అనంతరం విజయోత్సవ సంబరాలు నిషేధమని కర్నూలు రూరల్ సీఐ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కే నాగులాపురం పోలీస్ స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యర్తలతో శనివారం ఎస్ఐ ఏపీ శ్రీనివాసులుతో కలిసి ఆయన సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. విజయోత్సవ సంబరాలు, ర్యాలీలు, బాణాసంచా కాల్చడం తదితర వేడుకలు నిషిద్ధమన్నారు. జూన్ 6వ తేదీ అనంతరం పోలీసుల అనుమతితో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు ఉన్నారు.

4న ఆర్‌యూ పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపు


ట్రాఫిక్ మళ్లింపునకు సంబంధించి జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని రాయలసీమ యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో జూన్ 4వ తేదీ ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని, సహకరించాలని జిల్లా ప్రజలకు ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. ఓట్ల లెక్కింపు కట్టుదిట్టమైన భద్రత మధ్య, సీసీ కెమెరాల నిఘా నీడలో జరుగుతుందని తెలిపారు. శనివారం ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను క్షేత్రస్థాయి అధికారులతో కలిసి జాతీయ రహదారులను పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపును దృష్టిలో పెట్టుకుని వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్యస్థానాలు చేరుకోవాలని సూచించారు. నంద్యాల చెక్‌పోస్టు నుంచి రాయలసీమ యూనివర్సిటీ వెళ్లే మార్గంలో కేవలం 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల లెక్కింపు విధుల్లో పాల్గొనే సిబ్బంది, సంబంధిత అధికారులు, నియోజకవర్గ అభ్యర్థులు, వారి ఏజెంట్ల వాహనాలు మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్, దిన్నెదేవరపాడు, బి.తాండ్రపాడు, పసుపుల రోడ్డు వైపు వెళ్లే ఇతర వాహనాలకు ఆ మార్గం గుండా వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. నంద్యాల చెక్‌పోస్టు నుంచి బి.తాండ్రపాడు, నన్నూరు టోల్‌ప్లాజా, నంద్యాల వైపు వెళ్లే వాహనాలు బద్రినాథ్ నగర్, మారుతి మెగాసిటీ, శిల్పాటౌన్‌షిప్‌లకు సంబంధించిన కాలనీ వాసులు యూనివర్సిటీ మెయిన్ రోడ్డులో కాకుండా దిన్నెదేవరపాడు, మిలిటరీ క్యాంటీన్, బిర్లా జంక్షన్ మీదుగా వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అలాగే నంద్యాల వైపు నుంచి కర్నూలు నగరంలోకి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు నన్నూరు టోల్ గేట్, ఔటర్ రింగ్ రోడ్డు, గుత్తి పెట్రోల్ బంకు, చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. హైదరాబాదు వైపు నుంచి కర్నూలులోకి వచ్చే వాహనాలు, నందికొట్కూరు, ఆత్మకూరు, శ్రీశైలం, విజయవాడ నుంచి కర్నూలు వైపు వచ్చే అన్ని రకాల వాహనాలు, డోన్ నుంచి కర్నూలులోకి వచ్చే అన్ని రకాల వాహనాలు యథావిధిగా వెళ్లవచ్చని తెలిపారు. నంద్యాల వైపు నుంచి కర్నూలు వైపునకు వచ్చే వాహనాలను మాత్రమే దారి మళ్లిస్తున్నామని చెప్పారు. ఇతర జిల్లాల నుంచి కర్నూలుకు వచ్చేవారు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందనే విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజు, కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజు యాదవ్, కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీధర్, ట్రాఫిక్ సీఐ గౌతమి తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.

పీహెచ్‌సీలోనే...పెద్దాసుపత్రి వైద్య సేవలు !

● అందుబాటులో అత్యాధునిక పరికరాలు
● ఆరోగ్య కేంద్రంలోనే 63 రకాల వైద్య పరీక్షలు
● పీహెచ్‌సీల్లోనే కాన్పులు



గడివేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


అత్యాధునిక కాన్పుల గది


పీహెచ్‌సీలో అందుబాటులో అత్యాధునిక ల్యాబ్

గడివేముల: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. నాడు–నేడు కార్యక్రమం పీహెచ్‌సీల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారు. గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను నిర్మించి గ్రామస్థాయిలోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పీహెచ్‌సీల్లోనే పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించడంతో పాటు అధునాతన వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కో పీహెచ్‌సీకి టెలీ, పీసీఆర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, సీబీసీ తదితర పరికరాలు ప్రభుత్వం అందజేసింది. గతంలో 15 రకాల వైద్య సేవలు మాత్రమే అందుబాటులో ఉండగా.. నేడు 63 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రస్తుతం పెద్దాసుపత్రిలో అందే వైద్య సేవలన్నీ పీహెచ్‌సీలోనే అందుతుండటంతో ఇక్కడకు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు.

ఎంతో మేలు

గతంలో పీహెచ్‌సీ అంటే నామమాత్రంగా ఉండేది. చాలా రకాల వైద్య పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో వాటి కోసం రోగులు సమీప నంద్యాల, కర్నూలు జిల్లా కేంద్రంలోని అస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇది రోగులకు ఆర్థికభారంగా ఉండేది. అదనంగా శ్రమ పడాల్సి వచ్చేది. దీనివల్ల రోగ నిర్ధారణకు ఎక్కువ సమయం పట్టేది. అప్పటివరకు రోగికి సరైన వైద్యం అందేది కాదు. పరీక్షల కోసం దూరప్రాంతాలకు వెళ్లలేని కొందరు పేద రోగులు సైతం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించేవారు. ప్రస్తుతం అదనపు వైద్య పరీక్షలు పీహెచ్‌సీల్లోనే అందుబాటులోకి రావడంతో కొన్ని గంటల వ్యవధిలోనే వ్యాధి నిర్ధారణకు వీలవుతుంది. ఫలితంగా వెంటనే రోగికి సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించడానికి అవకాశం కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

అందుబాటులోని వైద్య పరీక్షలు

బ్లడ్ గ్రూప్, హెచ్ఐవీ, హె చ్‌సీఎస్‌సీ, వీడీఆర్ఎల్, గల్ల పరీక్ష, ర్యాండం బ్లడ్ సుగర్, మలేరియా, డెంగీ, వైడల్, యూరియా క్రియాటిన్, ప్లేట్లెట్ కౌంట్, ఎస్‌ఓటీ, ఎస్‌సీపీటీ, ఏఎల్పీ, లిపిడ్ ప్రొఫైల్, పొటాషియం, సోడియం, క్లోరైడ్, యూరిన్ మైక్రోస్కోపిక్, ఈసీజీ వంటి 63 రకాల పరీక్షలు చేస్తున్నారు.

రోగుల అవస్థలు తీరాయి



గతంలో పీహెచ్‌సీల్లో పూర్తి స్థాయిలో పరికరాలు లేకపోవడంతో పరిమితంగా రక్తపరీక్షలు చేయాల్సి వచ్చేది. రోగులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం అధునాతన పరికరాలు అందుబాటులోకి రావడంతో అన్ని రకాల పరీక్షలు చేసి రోగ నిర్ధారణ అయిన తరువాత అవసరమైన వైద్యాన్ని అందిస్తున్నాం. – డాక్టర్ మొల్లా జబీన్, పీహెచ్‌సీ వైద్యురాలు, గడివేముల

మా ఊరి ఆసుపత్రిలోనే అన్ని రకాల సేవలు



ఇకపై పరీక్షల కోసం పట్టణ ప్రాంతాలకు పేద రోగులు వెళ్లనవసరం లేదు. త్వరగా రోగ నిర్ధారణ అవుతుంది. వెంటనే అవసరమైన వైద్యాన్ని అందిస్తున్నారు. ప్రైవేట్ ల్యాబ్‌కు వెళ్లాల్సిన పనిలేకుండా ప్రభుత్వ ఆస్పత్రిలోనే అన్ని సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. అవసరమైన మందులను ఉచితంగా ఇస్తున్నారు. మా ఊరి ఆసుపత్రిలోనే అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండటంతో పట్టణాలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. – దస్తగిరి, గడివేముల

అన్ని రకాల మందులు అందుబాటులో



స్థానిక పీహెచ్‌సీలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అలాగే అత్యాధునాక పరికరాలు అందుబాటులో ఉండడంతో ఇక్కడే అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నాం. అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నాం. ప్రైవేట్ ల్యాబ్‌ల్లో వేల రూపాయలు ఖర్చయ్యే పరీక్షలను ఇక్కడ ఉచితంగా చేస్తున్నాం. – రాజ్‌కుమార్, ఫార్మసిస్ట్

శుద్ధజలం అందించడమే లక్ష్యం


కుళాయి నీటి నమూనాలను పరీక్షిస్తున్న డీఈఈ గోపాలకృష్ణ

కర్నూలు (టౌన్) : నగరవాసులకు శుద్ధజలం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవతేజ అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అతిసారం ప్రబలుతున్న నేపథ్యంలో శనివారం నగరపాలక సంస్థ పరిధిలోని 135 సచివాలయాల పరిధిలో తాగునీటి శాంపుల్స్ సేకరించారు. కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయ ఎనిమిటీ కార్యదర్శులు క్షుణ్ణంగా నీటి పరీక్షలు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో మంచినీటి సరఫరాపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. సచివాలయ ఉద్యోగులు చేసే నీటి నమూనా పరీక్షలను ఇంజినీరింగ్ సిబ్బంది తనిఖీ చేయాలన్నారు. క్లోరినేషన్ శాతాన్ని, అలాగే నీటి నాణ్యతపై ఏవైనా సందేహాలు వస్తే నీటి నమూనాలను హెడ్ వాటర్ వర్క్స్‌లోని ప్రత్యేక ల్యాబ్‌కు పంపించాలని ఆదేశించారు.

ఎండలో తిరగరాదు

● డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్


ఓఆర్ఎస్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్

కల్లూరు: అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ప్రజలు ఎండలో తిరగరాదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం కల్లూరు మండలం పర్ల గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ఎండలు పెరిగిన నేపథ్యంలో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. నీరసంగా అనిపిస్తే ఓఆర్ఎస్ నీరు తరచుగా తాగాలన్నారు. ఓఆర్ఎస్ పొడి అందుబాటులో లేకుంటే ఒక లీటర్ నీటికి 4 స్పూన్ల చెక్కర, ఒక టీ స్పూన్ ఉప్పును కలిపిన ద్రావణాన్ని తయారు చేసి తాగించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.